బషీర్‌బీబీ ఉత్సవాలకు సర్వం సిద్ధం

- మత సామరస్యానికి ప్రతీక పొన్నాడ బంగారు పాప
- 16 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ముజావర్లు



పొన్నాడలో వేంచేసిన బషీర్ బీబీ ఆలయం



పొన్నాడలో బషీర్‌బీబీని దర్శించుకుంటున్న భక్తులు (ఫైల్)

కొత్తపల్లి: కోరిన కోర్కెలు తీర్చడంతో పాటు హిందు, ముస్లింల ఐక్యతకు ఆధాద్య చిహ్నంగా భావించే బషీర్‌బీబీ ఉరుసు ఉత్సవాలు రాష్ట్రంలోనే ప్రసిద్ధి. మండలంలోని పొన్నాడలో జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మూడు రోజుల పాటు దర్గా ప్రాంగణంలోనే నివాసముండి ఉత్సవాలు ముగిశాక తమ సొంతూళ్లకు వెళ్లడం ఆనవాయితీ. ఈ ఏడాది జరిగే 69వ ఉరుసు ఉత్సవాలకు స్థానిక మజావర్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

16 నుంచి ఉరుసు ఉత్సవాలు

పొన్నాడలో ఈ నెల 16న 69వ ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 18న నిర్వహించే గంధోత్సవానికి భక్తులు అధిక ప్రాధాన్యం ఇస్తారు. మూలపేటకు చెందిన షేక్‌మౌలాసాహెబ్ ఇంటి వద్ద నుంచి గంధాన్ని 18వ తేదీ మధ్యాహ్నం నౌబత్‌ఖానా, బ్యాండ్ మేళాలతో గుర్రంపై ఊరేగింపుగా తీసుకొస్తారు. ఆ గంధాన్ని బషీర్ బీబీకి పూసిన అనంతరం భక్తులకు పంపిణీ చేస్తారు. మూడు రోజుల పాటు ఆలయంలో ఖురాన్‌ఖానీ, వాజ్, మిలాద్, షరీఫ్ మొదలగు సాంప్రదాయ పూజలు నిర్వహిస్తారు.

కుల మత బేధాలు లేకుండా...

ముస్లింలు, హిందువులు, క్రైస్తవులతో పాటు కుల మత భేదాలు లేకుండా అందరు పాల్గొవడం విశేషం. ముస్లింల దేవత బషీర్‌బీబీని స్థానికంగా బంగారు పాపమ్మ అని పిలుస్తారు. పూర్వం బషీర్‌బీబీ ఏడు అంతస్తుల భవనంలో ఉండేదని, తన బంగారాన్ని పేద ప్రజలు శుభకార్యాలు నిర్వహించేటప్పుడు అప్పుగా ఇచ్చేదని స్థానికులు చెబుతున్నారు. పేదలకు బంగారం అప్పుగా ఇవ్వడం వల్లనే ఆమెకు బంగారు పాపమ్మ అనే పేరు వచ్చింది. పొన్నాడలోని బషీర్‌బీబీ ఆలయం గతంలో ఏడు అంతస్థులు ఉండగా ఆరు అంతస్తులు భూమిలోకి కూరుకుపోయింది. ప్రస్తుతం ఒక అంతస్తు మాత్రమే భక్తులకు దర్శనమిస్తుంది. బషీర్‌బీబీని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. దీంతో భక్తులు మూడు రోజుల పాటు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని బషీర్ బీబీని దర్శించుకుంటారు. ఈ ఏడాది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ముజావర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భారీ బందోబస్తు

బషీర్ బీబీ ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తుల వాహనాలు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని సైతం సిద్ధం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న గోవాకు చెందిన రేడియో, టీవీ సింగర్ చాంచ్ ఆతీస్, బెల్గాంకు చెందిన సింగర్ సాదిగ సంజరిల మధ్య 'కాంపిటేషన్ కావాలి' ప్రోగాం ఏర్పాటు చేసినట్లు స్థానిక ముజావర్లు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



కొండెవరం డ్రైన్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో పారిశుధ్యం పడకేసింది. డ్రైన్లు పూడుకుపోయి మురుగు ఇళ్ల మధ్య నిలిచిపోయేది. దీనిపై ఈ నెల 3న పారిశుధ్యమంటే ఇంత నిర్లక్ష్యమా ? అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పారిశుధ్య కార్మికులతో తొలగించారు.

క్లుప్తంగా

విజయనగరం వెళ్లి.. పింఛను ఇచ్చి



విజయనగరంలో నరసింగరావుకు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ కార్యదర్శి జోగారావు

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగియడంతో ఇప్పటి వరకూ పింఛను తీసుకోని వారి వివరాలను సచివాలయ కార్యదర్శులు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక 8వ సచివాలయం పరిధి సంగీతరావుపేటకు చెందిన పింఛనుదారుడు అక్కిలిశెట్టి నరసింగరావు అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ జోగారావు తెలుసుకుని సోమవారం విజయనగరం వెళ్లి పింఛను అందజేశారు.

పాదయాత్ర భక్తులకు అల్పాహారం



దాత దంపతులకు జ్ఞాపికను అందజేసిన వాసుదేవ గురుస్వామి

సామర్లకోట: గొంచాల నుంచి వివిధ గ్రామాల మీదుగా శ్రీరామ రథంతో పాదయాత్రగా వెళుతున్న సుమారు 400 మంది భక్తులకు రెండో రోజు సోమవారం వేట్లపాలేనికి చెందిన దాతలు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు పాదయాత్ర నిర్వాహకుడు వాసుదేవ గురుస్వామి తెలిపారు. వేట్లపాలేనికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యులు గుమెళ్ల విజయలక్ష్మి, రామకృష్ణ దంపతులు సూరంపాలెం పామాయిల్ తోటలో అల్పాహారం ఏర్పాటు చేశారన్నారు. అక్కడ శ్రీరామ సంకీర్తనలు, భజనలు చేశారు. అనంతరం దాతలకు వాసుదేవ గురుస్వామి జ్ఞాపికను బహూకరించారు.

కర్రసాము పోటీల్లో ప్రతిభ



కర్రసాము పోటీల్లో విజేతలను అభినందిస్తున్న విజయ్‌ప్రకాష్ తదితరులు

పెద్దాపురం: నెల్లూరులో నిర్వహించిన సౌత్ ఇండియా స్థాయి కర్రసాము పోటీల్లో పెద్దాపురం శ్రీప్రకాష్ విద్యా సంస్థలోని 9వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తొమ్మిదో తరగతి చదవుతున్న సుధీర్ రోషన్‌నాయుడు, వై.రాఘవేంద్ర, గౌతమ్‌లు బంగారు, వెండి పతకాలను సాధించారన్నారు. విజేతలను డైరెక్టర్ విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, కల్చరల్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఐఈఆర్‌టీ జిల్లా అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్‌రెడ్డి



పెద్దాపురం: ఐఈఆర్‌టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా పెద్దాపురం భవిత కేంద్రం ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం ఆయన స్థానికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులంతా కలిసి ఎన్నిక నిర్వహించారన్నారు. ఇందులో అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులుగా సీహెచ్ వాణీపద్మజ, ఉపాధ్యక్షులుగా జి.నారాయణరావు, మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా వై.వెంకటలక్ష్మి, జనరల్ సెక్రటరీగా నాగార్జున, సహాయ కార్యదర్శిగా సీహెచ్ లోవరాజు, కోశాధికారిగా లోవ, సహ కోశాధికారిగా ప్రసన్నకుమారి, సభ్యులుగా నాగేశ్వరరావు, నారాయణరావు, రాజేష్‌బాబు, కుమార్‌రాజా, ఆశీర్వాదం, జ్యోతి ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

కొత్తపల్లి: సెల్‌ఫోన్ చోరీ కేసులో ముద్దాయికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం కోర్టు న్యాయమూర్తి ఎం.సుధారాణి తీర్పు ఇచ్చినట్లు సోమవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మూలపేటలోని సెల్‌ఫోన్ రిపేర్ షాపులో 2023 జూన్ 26న సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. దీనిపై అప్పటి ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏఎల్ఎన్ రోజా కేసును వాదించగా జడ్జి కాకినాడకు చెందిన బీర దుర్గావెంకటేష్ అనే ముద్దాయికి 7 నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై స్వామి నాయుడు తెలిపారు.

శుభకరా.. భీమేశ్వరా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోటలో భీమేశ్వరస్వామివారు



పంచారామ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలకు రాట వేస్తున్న దృశ్యం

సామర్లకోట: హరం హరా.. శుభకరా.. భీమేశ్వరా అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచారు. సామర్లకోటలోని పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలిపూజ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయంలోని ఉప ఆలయాలు, ధ్వజ స్తంభం, పెద్ద నంది వద్ద పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని దేవస్థాన అన్నదాన ట్రస్టు నుంచి ఏర్పాటు చేశారు. శ్రీకాకుళపు వినయ్, సత్యనారాయణమూర్తి, సన్నిదిరాజు వెంకన్న, వేమూరి సోమేశ్వరశర్మ పూజాదికాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించారు.

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

పంచారామ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా సోమవారం ముహూర్తపు రాట వేశారు. ఈ మేరకు కాలభైరవస్వామి ఆలయం వద్ద ఈఓ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గణపతి పూజలు చేశారు. మార్చి 6వ తేదీ నుంచి 11 తేదీ వరకూ ఆలయంలో స్వామివారి కల్యాణం, మహాశివరాత్రి, రథోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయంలో క్యూలైన్లు, విద్యుత్తు అలంకరణ, చలువ పందిర్లు, ఆలయ కోనేరులో నీరు నింపే కార్యక్రమాలను ప్రారంభించడానికి ముహూర్తపు రాట వేశారు. మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, బీవీ రమణ, చల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలంటూ ఫిర్యాదు

కాకినాడ సిటీ: పౌరసరఫరాల సంస్థ నుంచి రేషన్ షాపులకు బియ్యం, నిత్యావసర సరకులు సరఫరా చేసేందుకు బినామీ పేరుతో టెండర్లు దాఖలు చేసిన బొర్రా వెంకటరత్నంపై చర్యలు తీసుకోవాలని పెద్దాపురం మండలం దివిలికి చెందిన కె.శ్రీరామచంద్రమూర్తి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు సోమవారం ఫిర్యాదు చేశారు. జగ్గంపేట మండలం చంద్రమాంపల్లికి చెందిన బొర్రా వెంకటరత్నం తన భార్య పేరుతో రేషన్ షాపు నడిపేవాడని, అప్పట్లో రేషన్ షాపును అధికారులు తనిఖీ చేయగా 110 బస్తాలు తక్కువ ఉండడం గుర్తించి డీలర్‌షిప్‌ను రద్దు చేశారన్నారు. తిరిగి వెంకటరత్నం దివిలికి చెందిన అడ్డూరి సత్యనారాయణ పేరుతో స్టేజ్–2 కాంట్రాక్టర్‌గా ఉంటూ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం, నిత్యావసరాలు సరఫరా చేసేవాడన్నారు. దీనిద్వారా అతను అనేక అవకతవకలకు పాల్పడడంతో అధికారులు కేసులు నమోదు చేసి తొలగించారన్నారు. ఇప్పుడు మళ్లీ వెంకటరత్నం స్టేజ్–2 కాంట్రాక్టర్‌గా పుప్పాల కృపానందం పేరుతో దివిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు టెండర్ వేశాడన్నారు. అతని భార్యపై 6ఏ కేసులో ఉన్న వ్యాన్‌ను ట్రాన్స్‌పోర్టుకు వాడుతున్నాడని వివరించారు. అక్రమ మార్గంలో టెండరు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీరామచంద్రమూర్తి కోరారు.

ప్రమాద బీమాతో భరోసా



ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఆర్ఎం, బ్రాంచ్ మేనేజర్

సామర్లకోట: స్టేట్ బ్యాంకు ఖాతాదారులు ఏడాదికి రూ.500 చెల్లిస్తే ప్రమాద బీమాగా రూ.10 లక్షల పరిహారం అందిస్తామని స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ తపోధన్ డెహరి అన్నారు. స్థానిక పిఠాపురం రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో సోమవారం సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎం మాట్లాడుతూ వజ్రపు సురేష్ అక్టోబర్ 2022లో తమ బ్రాంచ్‌లో సేవింగ్స్ అకౌంట్‌ను ప్రారంభించి రూ.500 ప్రమాద బీమా చెల్లించాడన్నారు. ఈ తరుణంలో సామర్లకోట–పెద్దాపురం ఏడీబీ రోడ్డులో 2023 ఆగస్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేష్ చనిపోవడంతో ప్రమాద బీమాగా మంజూరైన రూ.10 లక్షల చెక్కును నామినీ అయిన తల్లి వి.నల్లమ్మకు అందించామని చెప్పారు. ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా ఉంటుందని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఏడాదికి రూ. వెయ్యి చెల్లిస్తే రూ.20 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనివాసు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



పెద్దాపురం స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న రామారావు

పెద్దాపురం: స్థానిక వాలు తిమ్మాపురం రోడ్డులోని టిడ్కో గృహ లబ్ధిదారులకు సత్వరమే ఫ్లాట్లను అప్పగించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో సీఐటీయూ నాయకులు సిరిపురపు శ్రీనివాసరావు, నీలపాల సూరిబాబుల ఆధ్వర్యంలో టిడ్కో లబ్ధిదారులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ స్పందనకు వచ్చే ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపుతానన్నారు. డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 12 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, డీఎల్‌పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దాపురం తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి



పెద్దాపురం: పెద్దాపురం మండల తహసీల్దార్‌గా ఎస్.శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ పనిచేసిన జితేంద్ర ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా ముసులూరు తహసీల్దార్ హోదాలో విధులు నిర్వహిస్తూ ఇటీవల విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓగా ఆయన చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చానని, ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని శ్రీనివాసరెడ్డి అన్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. తొలుత డిప్యూటీ తహసీల్దార్ కాంతారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్డీఓ జేఎస్ రామారావును మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డికి సిబ్బంది స్వాగతం పలికారు.

12న మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెద్దాపురం: పులిమేరులోని శ్రీసంపత్ సాయిబాబా సహిత అపర్ణాదేవి సత్యనారాయణ స్వామివారి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు బండారు నాగబాబు, శ్వేత దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా అన్నసమారాధనను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మల బాబు ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, తుమ్మల అచ్యుత రామయ్య, సుందరెడ్డి రాజు, తుమ్మల బుల్లియ్య, నాని, గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని సంతోష్‌నగర్‌కు చెందిన కొప్పిశెట్టి దుర్గా మల్లేశ్వరరావు (42) సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. భార్యతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులతో కలసి సంతోష్‌నగర్‌లో దుర్గా మల్లేశ్వరరావు ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, భార్యా పిల్లలకు దూరమై మానసిక ఒత్తిడికి గురవ్వడంతో ఇంట్లో పడక గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. తండ్రి రత్నం ఫిర్యాదు మేరకు ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: డివిజన్ పరిధిలోని అర్హత లేని వైద్యులు ఎవరైనా స్కానింగ్ సెంటర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ఎస్‌డీఏఎల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లో 28 స్కానింగ్ సెంటర్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. కొత్తగా సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్యాధికారి అనుమతి పొందాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదన్నారు. దీనిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. డివిజన్‌లోని అన్ని స్కానింగ్ సెంటర్లను కమిటీలు తనిఖీ చేస్తాయన్నారు. లింగ నిర్ధారణ జరిగితే, చాలా మంది ఆడ శిశువు అనగానే గర్భం తీయించుకోవడానికి నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. దీనిని అరికట్టేందుకే ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ కందుల వెంకటాచలం, వైద్యులు సత్యవేణి, అనూపరాయి, సత్యవంశీ, మాధురి, ఎన్జీఓ పల్లా వాసవి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు



పెద్దాపురంలో టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సాయిప్రసాద్

పెద్దాపురం: పట్టణంలో టిడ్కో లబ్ధిదారులందరికీ త్వరలోనే గృహాలను అందజేస్తామని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. స్థానిక వాలుతిమ్మాపురం రోడ్డులోని పట్టణ ప్రజలకు నిర్మించిన టిడ్కో గృహాలను సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పట్టణంలోని ప్రజలకు నిర్మించిన టిడ్కో గృహాలను వారం రోజుల వ్యవధిలో లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి ఇళ్ల తాళాలిచ్చి గృహాలను అప్పగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, టిడ్కో గృహ సముదాయంలోని ప్లాట్‌లను పరిశీలించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



కొడవలిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

పిఠాపురం: వచ్చే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ ప్రజలకు పిలుపు నిచ్చారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో పోలింగ్ స్టేషన్లను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికలు జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఓటుహక్కును అందరూ ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులతో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం చేరిన రాష్ట్ర స్థాయి సైన్స్ కళాయాత్ర



యాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

పిఠాపురం: ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకే రాష్ట్రస్థాయి సైన్స్ కళా యాత్ర నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక నాయకులు, రాష్ట్ర కళాయాత్ర కన్వీనర్లు కన్నబాబు, మురళీ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సైన్స్ కళా యాత్ర సోమవారం పిఠాపురం చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాలలో యాత్రను ఉద్దేశించి వారు మాట్లాడారు. మూఢనమ్మకాలను రూపు మాపి ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. నృత్య రూపకాలు, నాటికలు, గీతాలాపన, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించి మూఢనమ్మకాలను నమ్మవద్దంటూ సందేశం ఇచ్చారు కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు వి.సత్యనారాయణరెడ్డి, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సత్తిరాజు



ప్రత్తిపాడు: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు ఎన్నికయ్యారు. ప్రత్తిపాడులోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జిల్లా కిసాన్ మోర్చా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా బాలిన వెంకటేశ్వరరావు (జగ్గంపేట), పడాల శ్రీను (గొల్లప్రోలు), తండపురెడ్డి మాణిక్యం (ప్రత్తిపాడు), సిద్దా వీరభద్రరావు (కాకినాడ రూరల్), తంగిడిపల్లి గనిరాజు (జగ్గంపేట), ప్రధాన కార్యదర్శులుగా బంగారు రమణబాబులు (తుని), జీలకర్ర సత్యనారాయణ (పిఠాపురం), కార్యదర్శులుగా పెంకె వెంకటరమణ (పెద్దాపురం), ఆచంట శ్రీనివాస్ (కాకినాడ రూరల్), పాలకుర్తి సూర్యనారాయణ (జగ్గంపేట), దేవర రామకృష్ణ యాదవ్ (ప్రత్తిపాడు), కోశాధికారిగా పల్లా ప్రసాద్ (తుని)లతో పాటు మరో 16 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్సూరెన్స్ సెల్ కో కన్వీనర్ పెండెం బాబ్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనుం నాగబాబు, కామినేని జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్మృతివనం సందర్శన

తుని రూరల్: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు స్మృతి వనాన్ని సోమవారం డి.పోలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సందర్శించారు. స్వతంత్ర్య సమరయోధుల చరిత్ర, ఉద్యమ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించడంలో భాగంగా హెచ్ఎం వాడపల్లి వెంకటరమణమ్మ (రాణి) ఆధ్వర్యంలో ఐదో తరగతి విద్యార్థులు కేడీ పేటలోని స్మృతి వనంలో అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులు, నర్సీపట్నంలోని సీతారామరాజు చేతిలో హతమైన బ్రిటీష్ అధికారులు హైటర్, కౌవర్టుల సమాధులను సందర్శించారు. అల్లూరి త్యాగం ఫలితంగా ప్రస్తుతం మన్యం ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని హెచ్ఎం విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ, బి.సారథ, పి.అప్పారావు, జి.రామ్‌కుమార్, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



పోలింగ్ కేంద్రాల లిస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు పెద్దాపురం డీఎస్పీ కె. లతాకుమారి తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు చెప్పారు. గ్రామ పెద్దలు, సంబంధిత పార్టీల కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇచారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్. రామకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న కాకినాడ ఆర్డీఓ కిషోర్

పిఠాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారుడికి ఇంటి స్థలం రిజిస్ట్రేషన్లు చేసి అప్పగించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ తెలిపారు. పిఠాపురంలో వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించామన్నారు. లబ్ధిదారులు తమ రికార్డులు చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పట్టణ పరిధిలో ఇళ్ల పట్టాలు పొందిన వారికి త్వరలోనే ఇళ్ల స్థలాలు అప్పగించడానికి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.